# చీకటిలో వెలుగురేఖ

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

9880467321 సెల్‌ఫోన్ 'జీవితమే మధురము' అని పాడుతూ మోగింది. అది 'సేవిక' అసోసియేషన్ టోల్‌ఫ్రీ నెంబర్. వస్తున్న ఆవులింతను ఆపుకుంటూ ఫోన్ అందుకుని "హలో.. సేవిక హెల్ప్‌లైన్. చెప్పండి మీ సమస్య ఏమిటో?" మృదువుగా అడిగింది సురుచి. అవతలివైపు నుండి సమాధానం రాలేదు. అణచుకున్నా ఆగని వెక్కిళ్ల శబ్దం మాత్రం వినబడుతున్నది.

"హలో...హలో మీరు అధైర్యపడకుండా మీ కష్టాన్ని గురించి చెప్పండి. మీ బాధ పంచుకోవడానికి మేమున్నాం. ఏ సమస్యకైనా సంయమనంతో ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. చెప్పండి మీ బాధేమిటి? మీరు ఎక్కడ నుండి ఫోన్ చేస్తున్నారు? హలో...హలో" గొంతులో ఆందోళన కనబడనీయకుండా వీపు తట్టి ధైర్యం చెప్తున్నట్లు ఆత్మీయంగా అడిగింది సురుచి.

"నేనెక్కడినుంచి ఫోన్ చేస్తున్నానో చెప్పి ప్రయోజనం ఉండదు. ఎందుకంటే నేను ఇంకో పదినిముషాల్లో చనిపోతున్నాను. చనిపోయే ముందు ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడాలనిపించి మీకు ఫోన్ చేసాను. ఈ రోజు పేపర్లో మీ ఫోన్ నెంబర్ చూసాను. మీ సంస్థ గురించి చదివాను" అవతలివైపు మాట్లాడుతున్న స్త్రీ గుండె చిక్కబట్టుకుని దుఃఖం అణచుకుని చెప్తున్నట్లు తెలిసింది సురుచికి.

అర్ధరాత్రి ఒంటిగంట సమయం. ఎన్ని కష్టాలున్నా నిద్రాదేవి ఒడిలో సేదతీరే వేళ. రిలీవర్ రాగానే ఇంటికి వెళ్లి నిద్రపోతే చాలుననుకుంటూ భారంగా వాలిపోతున్న కన్నులతో టేబుల్‌మీద తల వాల్చి కూర్చున్న సురుచిలో ఇప్పుడు నిద్రమత్తు ఎగిరిపోయింది. ఫోన్‌లో మాట్లాడుతున్న స్త్రీ కష్టాలకో, కన్నీళ్లకో ఓడిపోయి క్షణికమైన ఆవేశంలో తప్పుడు నిర్ణయం తీసుకోకుండా ఎలా ఆమెను ఆపాలా అని ఆమె మనసు చురుకుగా ఆలోచిస్తోంది.

టీ తాగి వస్తానంటూ కింద క్యాంటిన్‌కు వెళ్లిన కార్తీక్ వస్తే ఈ కాల్ ఏ ఏరియా నుండి వచ్చిందో కనుక్కునే ప్రయత్నం చేయవచ్చు అని తనతో పాటు ఆ రోజు విధి నిర్వహణలో వున్న కార్తీక్ కోసం ఆమె చూపులు క్షణానికోసారి గుమ్మం వైపు వెళ్తున్నాయి.

"హలో... చెప్పండి. మీరు రెగ్యులర్‌గా పేపరు చదువుతారన్నమాట. మా సంస్థ ఆశయాలు గురించి చదివినప్పుడు మీకేమనిపించింది? మీకు అభిరుచి వుంటే మీరూ మా కార్యక్రమాలలో పాలుపంచుకోవచ్చు" పది నిముషాల్లో ప్రాణం విడుస్తున్నానని ఆమె చెప్పిన విషయం తనకు వినబడనట్టే మాట మార్చింది సురుచి.

అవతలివైపు నుండి దీర్ఘమైన నిట్టూర్పు జవాబుగా వచ్చింది.

"రోజూ పేపరు చదివినా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఉన్నా ప్రయోజనమేమిటి? ఈ అవమానాల నుండి, శారీరక హింసల నుండి శాశ్వతంగా విముక్తి పొందబోతున్నాను. అయితే నేను పిరికితనంతో ప్రాణం తీసుకోవడంలేదు. మా అమ్మానాన్నలకు జీవితాంతం గుదిబండగా ఉండకూడదనీ, నామూలంగా మా చెల్లెలి చదువు ఆగిపోకూడదనీ ఆత్మహత్యకు తెగించాను. మరింత కట్నం తేలేకపోతే నా చిన్నారి పాపను నన్ను ముట్టుకోనివ్వకుండా ఏడిపించే అవకాశం వున్న ఆ రాక్షసులకు ఇవ్వకూడదని నేనే బంధాన్ని తెంచుకుని వెళ్లిపోతున్నాను" చెప్పున్న ఆ స్త్రీ గొంతులో కోపం, దుఃఖం, నైరాశ్యం పోటీ పడుతున్నాయి.

"మీ మానసిక స్థితిని నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే రెండేళ్లక్రితం సరిగ్గా మీలాంటి పరిస్థితిలోనే నేనూ ఉన్నాను. నెలకోసారి డబ్బు తీసుకుని రమ్మని నన్ను చావబాది పుట్టింటికి తరిమేసేవాడు నా మొగుడు. అప్పటికే నా పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక ఇల్లు అమ్ముకున్న అమ్మానాన్నా నా వంటిమీద వున్న వాతలు చూసి కుళ్లి కుళ్లి ఏడుస్తుంటే చావే శరణ్యమనిపించింది. గుప్పెడు నిద్రమాత్రలు నీళ్లల్లోకి పోసుకుని మింగేయబోతుంటే దీపూ ఏడుపు వినపించింది" సురుచి క్షణం ఆగింది.

అప్పుడే లోపలికి వచ్చిన కార్తీక్‌కి నెంబర్ ట్రేస్ చేయమని సైగలతో హెచ్చరించింది.

"దీపూ ఎవరు?" అడుగుతున్న ఆ స్త్రీ గొంతులో ఆతృత తొణికిసలాడింది.


"నా కొడుకు. అప్పుడింకా రెండేళ్లవాడు. నేను పెడితేతప్ప అన్నం తినడు. నేను పక్కన లేకపోతే నిద్రపోడు'' సురుచి ఆగింది.



"మా పాపకు అదే వయసు. నేను పోయాక ఎలా బ్రతుకుతుందో? వాళ్ల నాన్న నన్ను గదిలో పెట్టి తాళం వేస్తే కిటికీ ముందు నిలబడి ఏడుస్తుంది. అతను నా చేతిమీద సిగరెట్టుతో కాల్చిన వాతలు కనబడితే 'అబ్బు..అబ్బు' అంటూ గుక్కపెట్టి ఏడుస్తోంది'' ఫోను చేసిన స్త్రీ గొంతులో దుఃఖం సుళ్ళు తిరుగుతోంది.

"కానీ మావాళ్లకు ఈ రాక్షసుడు నన్ను పెట్టే బాధలు తెలియవు. చెల్లి పెళ్లికి ఎక్కడ అప్పు తేవాలా అని దిగులు పడే అమ్మానాన్నలకు నా మొగుడు, అత్తమామలు పెట్టే హింస గురించి చెప్పలేకపోయాను'' తిరిగి అన్నది ఆమె.

"నాకు చెల్లెళ్లు లేరు. నేను పోతే ఆ దిగులుతో మా అమ్మా నాన్న చనిపోతారు. నా దీపూ దిక్కు లేని వాడవుతాడు. అందుకే వాడికోసం బ్రతికాను. ఇవ్వాళ స్వతంత్రంగా ఉద్యోగం చేసుకుని వాడిని



అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాను. ఒకరకంగా మీ పరిస్థితి నా పరిస్థితికన్నా నయం'' అని ఆగింది సురుచి.

కార్తీక్ నెంబరున్న ఏరియాను కనుక్కోగలిగానని సైగ చేయడంతో కాస్త ఉత్సాహం వచ్చింది. 'పదవెళదాం' అని సైగచేసి చేతిలో సెల్‌ఫోన్‌తో

అతనితో కలసి లిఫ్ట్‌వైపు బయల్దేరింది.

"నన్ను ఒక గదిలో పెట్టి తాళంవేసి, మాటలైనా పూర్తిగా రాని నా చిన్నారిని మరో గదిలో పడుకోబెట్టి ఇల్లు తాళం వేసుకుని వెళ్లాడా రాక్షసుడు. తను తిరిగి వచ్చేసరికి నేను మనసు మార్చుకుని పుట్టింటికి వెళ్లి డబ్బు తెస్తానని అంటే సరే, లేకుంటే మా ఇద్దర్నీ చంపేస్తానన్నాడు. అందుకే నేను వాడు తిరిగి వచ్చేంతలో చచ్చిపోవాలి. అప్పుడు నన్నేమీ చేయలేడు. ఇలాంటి పరిస్థితిలో వున్న నేనే నయం అన్నారెందుకు? త్వరగా చెప్పండి. తప్ప తాగి తూలుకుంటూ వచ్చి మళ్లీ నన్ను చావబాదుతాడు. కిరసనాయిలు పోసి తగులబెట్టి చంపుతానన్నాడు.ఆ భయంకరమైన చావుకన్నా ఉరి పోసుకుని చావాలని నిశ్చయించుకున్నాను. చెప్పండి ఎందుకన్నారలా?" ఒకరకమైన ఉద్విగ్నత కనబడుతోంది ఫోనులో మాట్లాడుతున్న స్త్రీ గొంతులో.



## పడ్డానండి ప్రేమలో మరి...

నయనతార మళ్లీ ప్రేమలో పడిందనే కథ ఒక్కసారిగా చెన్నయ్ సినీ వర్గాల్లో గుప్పుమంది. అది కూడా ఎవరితో? శింబుతోనట. ఇద్దరూ పాత గొడవలు మర్చిపోయి, తిరిగి 'దోస్తీ' చేయడానికి ముందుకొస్తున్నట్టు సినీ జనాలు తెగ చెప్పేసుకుంటున్నారు. అఫ్‌కోర్స్, రాజకీయాల్లో ఎలాగైతే శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు వుండరో సినీ రంగంలోనూ దాదాపు అదే పరిస్థితి అన్నమాట.



క్రింద సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లో బయల్దేరారు కార్తీక్, సురుచి హడావిడిగా.

సురుచి మాట్లాడుతూనే వుంది.

"అదిగో ఆ విషయానికే వస్తున్నాను.నేను పోతే నా దీపు తల్లిలేని అనాథ అయ్యేవాడు. కానీ మీ పాపకు మరొక తల్లి ప్రేమ దొరకవచ్చు" కాస్త ఆగింది.

"అంటే ఆ దుర్మార్గుడు రెండో పెళ్లి చేసుకుంటే ఆ సవతి తల్లి నా బిడ్డను ప్రేమగా చూస్తుందా? ఏం మాట్లాడుతున్నారు మీరు. మీరు చెప్పేది నమ్మడానికి నేనంత తెలివిలేనిదాన్ని కాదు" కోపంగా పలికిందా విడ గొంతు.

"కోప్పడకండి. మీకు తెలివిలేదని నేనెలా అంటాను? అయితే ఆవేశంలో మీరు ఆలోచనా జ్ఞానాన్ని కోల్పోయారని అనిపిస్తోంది. అందుకే నేనన్నమాటలు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇందాక చెప్పాను గుర్తుందా నాకు చెల్లెళ్లు లేరు అని. మీరు అదృష్టవంతులు. మీకు తోడబుట్టిన తోడు వుంది అని" సురుచి ఆగింది.

ఆమె ఎదురుచూసినట్లే ఫోనులో మాట్లాడుతున్న ఆమెకి కోపం వచ్చింది.

"అసలు మీకు బుర్ర లేనట్టుంది. నా చావుకీ ఈ చెల్లెళ్ల విషయానికీ సంబంధం ఏమిటో నాకర్థం కావడంలేదు? సరే నేను ఫోన్ పెట్టేస్తున్నా. వాడు తిరిగి వచ్చే వేళవుతోంది. ఇక వుంటాను. బై" విసుగ్గా, అలసటగా నిరాసక్తంగా అన్నదామె.

"ఒక్కక్షణం ఆగండి. నా ఉద్దేశ్యం ఏమిటంటే మీ చెల్లెలే రేప్పొద్దున మీ పాపకు తల్లి కావచ్చు అని" వేగం పెంచమని డ్రైవర్‌కు సైగ చేస్తూ అంది సురుచి.

"అంటే?" ఆమె గొంతులో అనుమానం, భయం.

"మీ భర్త ఎంత దుర్మార్గుడో మీ వాళ్లకు మీరు చెప్పలేదు. వాళ్ల దృష్టిలో అతను మంచివాడు. ఏదో చిన్న గొడవపడి ఇంత పని చేసారని మీ వారు ఏడిస్తే నమ్ముతారు, ఓదారుస్తారు. తరువాత అతని ఒంటరి జీవితం చూడలేక, తల్లిలేని మీ పాపకు ఎవరో సవతి తల్లిగా వచ్చి కాల్చుకు తినడంకన్నా మీ చెల్లెలినే అతనికిచ్చి చేస్తే అక్క బిడ్డను ప్రేమగా చూస్తుందని ఆలోచిస్తారు. మీ చెల్లెల్ని ఒప్పిస్తారు. అప్పుడు మీ చెల్లెలి జీవితం కూడా మీ జీవితంలాగే..." సురుచి గింది.

"జరగదు. అలా ఎప్పటికీ జరగనివ్వను" అవతలివైపు నుండి ఆమె ఆవేశంగా అంది.

"ఎందుకు జరగదు? ఎన్నో కుటుంబాలలో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని వింటున్నాము. అయినా మీరే లేనప్పుడు మీ చెల్లెలి జీవితం ఏమయితే మాత్రం మీకెందుకు? అయిదు నిముషాల్లో చావబోతున్న మీరు జరగబోయేదాన్ని ఎలా ఆపగలరు?" సురుచి ఆమెలోని వివేకాన్ని, విచక్షణను మేల్కొలిపి క్షణికావేశం నుండి బయట పడేయడానికి తనకు తోచిన ఆఖరి అస్త్రం ప్రయోగించి ఆమెకు ఆలోచించుకోవడానికన్నట్లు కాస్త ఆగింది.

"అయ్యో పాప లేచింది. ఏడుస్తోంది" ఆమె ఫోనులో నిస్సహాయంగా ఏడుస్తోంది.

"తలుపులు బాదండి. ఏదైనా వస్తువు దొరికితే కిటికీలోనుండి బయటకు విసరండి."

వ్యాను ఆ వీధి మలుపు తిరిగింది.

ఒక ఇంటి కిటికీలో నుంచి విసురుగా ఒక గ్లాసు బయటకు దూసుకు వచ్చింది.

"తొందరగా ఆ ఇంటిముందు బండి ఆపు" అంది సురుచి అతన్ని తొందరపెడుతూ.

అంబులెన్స్ ఆ ఇంటిముందు ఆగింది.

"క్విక్... తాళం పగులకొట్టండి" సురుచి సెల్‌ఫోన్ చేతిలో మూసి అన్నది.

చేతిలో సెల్‌ఫోన్‌తో, ఫోన్ నుండి వ్రేలాడుతున్న చీర కొనతో స్టూలు మీద నిలబడి హిస్టరికల్‌గా ఏడుస్తున్న ఆమె తన గది తలుపులు బార్లా తెరిచి లోపలికి వస్తున్న ఆగంతకులను చూసి ఒక్కక్షణం అలా చేష్టలుదక్కి నిలబడింది.

మరుక్షణం స్టూలు మీద నుండి దూకి పాప ఏడుపు వినిపిస్తున్న గది వైపు పరుగెత్తింది.

అమ్మ ఎత్తుకోగానే అప్పటిదాకా గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ పాప తక్కున ఏడుపు ఆపి అమ్మ మెడ చుట్టూ చేతులు వేసి భుజంమీద తల పెట్టి పడుకుంది పాప.

పాప ఏడుపు ఆపగానే అప్పుడే ఆమె స్పృహలోకి వచ్చినట్లు ఇంట్లోకి దూసుకువచ్చిన ఆ ఇద్దరు అపరిచితులను అనుమానంగా, భయంగా చూసింది.

"ఎవరు మీరు?" అని అడిగింది భయంగా, అనుమానంగా వాళ్లవంక చూస్తూ

"ఇంతసేపు ఫోనులో మీతో మాట్లాడింది నేనే" అంది సురుచి చిరునవ్వుతో.

బాబ్డ్ హెయిర్‌తో జీన్స్‌లో వున్న ఆ ఇరవై ఏళ్ల అమ్మాయి వైపు నమ్మలేనట్లు చూసిందామె.

"మీరు... దీపు వాళ్ల అమ్మ? మీరేం అంటున్నారో నాకేంఅర్థం కావడంలేదు" అంది సందిగ్ధంగా.

"దీపు వాళ్ల అమ్మను కూడా మేమే కాపాడాము. వాళ్ల సంగతి చెప్పి ఇప్పుడు మిమ్మల్ని కాపాడాము. పదండి ముందు పోలీస్‌స్టేషన్‌కు. మీ ఆయనమీద గృహహింస, కట్నం వేధింపుల మీద రిపోర్టు ఇచ్చి ఇవ్వాల్టికి మా హాస్టల్‌లో ఉండి రేపు మీ అమ్మగారింటికి వెళ్దురుగాని" అంది సురుచి చిరునవ్వుతో.

"మా పాపకు తల్లిలేని దురదృష్టం పట్టకుండా కాపాడారు. నా ప్రాణం కాపాడారు. మీ రుణం ఎలా తీర్చుకోగలను?" కళ్లనిండా నీళ్లతో అన్నదామె.

"మా సంస్థలో సభ్యత్వం తీసుకోండి. మగవారి దౌర్జన్యానికి బలవుతున్న అబలలకు ఆత్మధైర్యం కలిగించండి. క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడేవారికి ధైర్యం చెప్పండి. సమయస్ఫూర్తితో వ్యవహరించి వారి మనసు కాస్త మళ్లిస్తే వారిలో వివేకం మేల్కొంటుంది. చావు అన్ని సమస్యలకు పరిష్కారం కాదని వాళ్లకు నచ్చచెప్పండి" పాపను తన చేతిలోకి తీసుకుని ఆమె భుజం చుట్టూ చేయివేసి బయటకు మెల్లగా నడిపించింది సురుచి.

కార్తీక్ ఆమె వెంట నడిచాడు. ముగ్గురూ వ్యాన్ ఎక్కి కూర్చున్నాక అంబులెన్స్ కూడా కదిలింది.

"రేపు పాథాలజీ పరీక్ష. నువ్వేమైనా చదివావా?" కార్తీక్‌ను అడిగింది సురుచి.

లేదు అన్నట్లు భుజాలు కదిలించాడు.


"మీరు స్టూడెంట్సా?" ఏం చదువుతున్నారు" అరగంట ముందు ఆత్మహత్యకు తలపడిన ఆమె కుతూహలంగా అడిగింది వాళ్లవంక ఆత్మీయతతో చూస్తూ.

"మెడిసిన్ చదువుతున్నాం. సేవిక హెల్ప్‌లైన్‌లో వాలంటీర్స్‌గా చేస్తున్నాం" అంది సురుచి.

"మా ఊర్లో నేను మీ సేవిక సంస్థ ఏర్పాటుచేసి నా వంతు సేవ చేస్తాను. ఆ విధంగా మీకు కృతజ్ఞతలు తెలుపుకుంటాను" ఆత్మవిశ్వాసంతో అన్నదామె.

నిశీధిలో వెలుగులు చిమ్ముతూ వ్యాన్ ముందుకు దూసుకుపోతోంది.

★



## రంభ కాలేజీ

రంభకి స్కూళ్లు, కాలేజీలు ప్రారంభించాలన్న ఆలోచన వచ్చినట్టుంది. ఎలాగూ సినిమాలు తగ్గిపోయాయి కాబట్టి ఏదో ఒక వ్యాపకం వుండాలని కాబోలు ఓ ఇంగ్లీషు మీడియం స్కూలు ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోందని వినికిడి. తను ఎక్కువగా చదువుకోలేదు కాబట్టి తనైనా పదిమందికి చదువు చెప్పే ప్రయత్నాల్లో వుందన్నమాట.

